క్లుప్తంగా

ఎం.కోడూరు మోదమాంబ ఆలయానికి విరాళం

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు మోదమాంబ ఆలయానికి గ్రామానికి చెందిన బూరె అప్పారావు, మాధవీలత దంపతులు రూ.10 వేలు నగదును సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు గురువారం సాయంత్రం అందజేశారు. అప్పారావు, తల్లి తండ్రులు అయిన నర్సింహమూర్తి, బంగారమ్మ జ్ఞాపకార్థం ఈ నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు రమణబాబు పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రి రాజీనామా చేయాలి

నర్సీపట్నం : పార్లమెంట్‌లో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను అవమానించిన మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. హోంమంత్రి వైఖరిని నిరసిస్తూ అబిద్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హోంమంత్రి రాజీనామా చేయాలని, రాజ్యాంగాన్ని కాపాడాలని అన్నారు. దేశంలో రాజ్యాంగం అమలు కావడం లేదన్నారు. అంబేడ్కర్‌పై హోంమంత్రి వ్యాఖ్యలను లౌకికవాదులంతా ఖండించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్.గౌరి, ట్రెజరర్ సూర్యప్రభ పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల రక్త నమూనాల సేకరణ

చీడికాడ : గొర్రెలు, మేకల్లో బ్రూసిలేసిస్ వ్యాధి నివారణకు గాను రక్త నమూనాలు సేకరిస్తున్నట్టు విశాఖపట్నం ప్రాంతీయ పశువైద్య నిర్ధారణ ప్రయోగశాల వైద్యాధికారి డాక్టర్ ఎం.హిమజ పేర్కొన్నారు. మండలంలో బైలపూడి, బి.సింగవరం, జైతవరం, అర్జునగిరి గ్రామాల్లో ఆమె పర్యటించారు. పీపీఆర్ వ్యాక్సినేషన్ పనితీరును పర్యవేక్షించారు. బైలపూడి, బి. సింగవరం, గ్రామాల్లో గొర్రెలు, మేకలకు రక్తనమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆవులు, గేదెలు, దూడలకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. ప్రతి ఏటా జూన్ మాసంలో చిటిక వ్యాధికి టీకాలు వేయించాలని, జూలైలో నీలినాలుక వ్యాధి, సెప్టెంబరులో చెడుపాలుడు వ్యాధికి టీకాలు వేయాలని వేయించాలని అన్నారు. కార్యక్రమంలో ఖండివరం, పెదగోగాడ పశువైద్యాధికారులు గణేష్, రాఘవమ్మ, పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కె.కోటపాడు : ఆరోగ్యశ్రీ పథకం వర్తించలేకుండా అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడే వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక భరోసా దక్కనున్నట్టు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. కింతాడ గ్రామానికి చెందిన కిలపర్తి సన్నిబాబు ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. మెరుగైన వైద్యంకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తును చేసుకున్నాడు. దీంతో సన్నిబాబుకు మెరుగైన వైద్యానికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.లక్షా 16వేల నగదు మంజూరు అయ్యింది. ఈ నగదుకు సంబంధించిన చెక్కును గురువారం కె.కోటపాడులో సన్నిబాబు భార్యకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అందించారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రొంగలి మహేష్, కన్నూరు సూర్యనారాయణ పాల్గొన్నారు.

హైందవ శంఖారావంపై ప్రచారం

మాడుగుల రూరల్: వచ్చే ఏడాది జనవరి 5వ తేదీన గన్నవరం వద్ద జరిగే హైందవ శంఖరావం భారీ బహిరంగ సభకు ప్రతి హిందువు స్వచ్ఛందంగా తరలిరావాలని మండల విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు, హైందవ శంఖారావం ఇన్‌చార్జి రాపేట రామకొండలరావు కోరారు. గురువారం ఆయన కె.జె.పురం, వంటర్లపాలెం గ్రామాల్లో ఈ కార్యక్రమంపై ప్రచారం నిర్వహించారు. దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కలిగించేలోగా దేవాలయాల నిర్వహణలో పలు సంస్కరణలు చేయాలని, వాటి కోసం 5 లక్షల మంది హిందువులతో ఈ శంఖారావం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కె.జె.పురం గ్రామ వీహెచ్‌పీ అధ్యక్షుడు సాలాపు జగన్నాథరావు, కార్యదర్శి బి.జగ్గారావు, సహాయ కార్యదర్శి పరిమి కాసుల జగ్గారావు, వెంకటరమణ, మామిడి శ్రీరాములు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

రోలుగుంట : కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులు 35 మందికి డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు స్టడీ మెటీరియల్‌ను స్కందర్క ఇన్‌ఫ్రా కన్‌స్ట్రక్షన్ మేనేజింగ్ డైరెక్టర్ మటం రాజబాబు అందజేశారు. పాఠశాల మైక్, స్పోర్ట్స్ మెటీరియల్ కూడా అందజేశారు. రాజబాబుని హెచ్‌ఎం శెట్టి మోహన్, ఉపాధ్యాయులు అభినందించారు.


తారుపోతకు సిద్ధంగా ఉన్న రహదారి


గెడ్డ వద్ద రోడ్డు జారిపోకుండా వేసిన రక్షణ గోడ


కొండెంపూడి గెడ్డ వద్ద నిర్మించిన కల్వర్టు

దశాబ్దాల కల.. నెరవేరుతున్న వేళ

ఓట్ల కోసం హామీలిచ్చి తరువాత మరిచిన నేతలకు భిన్నంగా ఓట్లతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరి పురోభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందించాలన్న జగనన్న దృక్పథం ఎన్నో పల్లె గ్రామాల ప్రగతికి బాటలు వేసింది. శివారు గ్రామాలకు మెరుగైన రహదారి ఉంటే విద్య, వైద్యం, మెరుగైన మౌలిక వసతులు అందించి ఆదుకోవచ్చునన్న జగనన్న దార్శనిక సంకల్పం, మాజీ డిప్యూటీ సీఎం బూడి ఆకాంక్షతో నేడు ఆయా గ్రామాలకు మెరుగైన రహదారి సౌకర్యం కలగనుంది.

- శివారు గిరి గ్రామాలకు తీరనున్న రహదారి కష్టాలు
- వి.బి.పేట నుంచి కొండెంపూడి – గొవ్వూరుకు తారురోడ్డు నిర్మాణం
- గత ప్రభుత్వ హయాంలో రూ. 5.65 కోట్లు మంజూరు
- 75శాతం మేర పూర్తి అయిన పనులు
- త్వరలోనే అందుబాటులోకి..


రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న అప్పటి డిప్యూటీ సీఎం బూడి(ఫైల్)

చీడికాడ : కొండల్లో అటవీ ప్రాంతంలో గల ఆ నాలుగు శివారు గిరిజన గ్రామాల్లో మొత్తం జనాభా 250 మంది మాత్రమే. అయితే బ్రిటిష్ కాలం నుంచి నేటి వరకు సాయంత్రం అయిందంటే ఆ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. అదే వర్షాకాలం అయితే గెడ్డలు దాటుకుంటూ పగలు కూడా ఆ రహదారుల వెంట నడిచి వెళ్లడం నరకప్రాయమే. అటువంటి గిరి గ్రామాల దశను మార్చి అధునిక ప్రపంచానికి దగ్గర చేసేందుకు 2006లో నడకదారిగా ఉన్న మార్గాన్ని అప్పటి సీఎం వైఎస్సార్ హయాంలో మట్టిరోడ్డుగా ఏర్పాటు చేయగా, గత ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషితో నిధులు మంజూరు కావడంతో తారురోడ్డుగా మారి ఏళ్లనాటి గ్రామస్తుల కల త్వరలో సాకారం కానుంది.

ఏళ్లుగా నిర్లక్ష్యం మాటున...

మండలంలోని శివారు పంచాయతీ అయిన వి.బి.పేట పరిధిలో కొండెంపూడి, గొవ్వూరు, ముడిచర్ల, జైపురం అనే నాలుగు గిరిజన గ్రామాలున్నాయి. ఈ గ్రామాలు వి.బి.పేట నుంచి సుమారు 5 నుంచి 6 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. వారంతా ఏ చిన్న వస్తువు కొనుక్కోవాలన్నా వి.బి.పేట రావల్సిందే. గ్రామస్తులు బయట ఊర్లకు వెళితే సాయంత్రంలోగా తిరిగి రావాల్సిందే. చీకటి పడితే సరైన రహదారి సౌకర్యం లేక రాత్రి వి.బి.పేటలో గడిపి ఉదయాన్నే గ్రామాలకు వెళ్లాలి. రాత్రి సమయాల్లో విష పురుగులు కుట్టినా, ప్రమాదాలు సంభవించినా అత్యవసర వైద్యసహాయం అవసరమున్నా భగవంతునిపై భారం మోపి ఉదయం వరకు వేచి ఉండాల్సిందే. ఈ మొత్తం నాలుగు గ్రామాల్లో 250 మంది జనాభా ఉండడంతో ఏళ్లుగా పాలకులు నిర్లక్ష్యం చూపి వీరి సమస్యను పట్టించుకోలేదు.

మట్టి రోడ్డు నేడు తారు రోడ్డుగా..



ఇప్పటి వరకు మా కుటుంబసభ్యులం మూడుమార్లు సర్పంచ్‌లుగా చేశాం. 2006లో నేను సర్పంచ్‌గా ఉన్నప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ హయాంలో ఈ గ్రామాలకు వెళ్లే నడకదారిని మట్టిరహదారిగా నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు మరే నేత పట్టించుకోలేదు. రహదారి లేక ఆ నాలుగు గ్రామాల గిరిజనులు ఇన్నాళ్లు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఈ సమస్యను మాజీ డిప్యూటీ సీఎం బూడి దృష్టికి తీసికెళ్లడంతో ఆయన అప్పటి సీఎం జగనన్నతో చెప్పి తారురోడ్డు మంజూరు చేశారు. వై ఆకారంలో గల ఈ రోడ్డు వీబీపేట నుంచి 2 కిలోమీటర్లు వెళ్లాక ఒక వైపు కొండెంపూడి, మరో వైపు గొవ్వూరుకు వెళుతుంది.ఈ రహదారుల పరిధిలోనే ముడిచర్ల, జైపురం గ్రామాలున్నాయి. నేటికి మా కల నెరవేరింది.

– వంటాకు నర్సింహమూర్తి, సర్పంచ్, వి.బి.పేట

మాట నిలబెట్టుకున్నారు..



నా చిన్నప్పటి నుంచి మాకు రోడ్డు ఉంటే బాగుండును అనుకునే వాళ్లం. ప్రతి మారు మా గ్రామానికి ఓట్లకోసం వచ్చే నాయకులకు మాకు దారి ఎయ్యండని చెప్పేవాళ్లం. తరువాత వాళ్లు మరిచి పోయేవాళ్లు మేం అడగడం మానేసాం. జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత మా బాధని మా నాయకుల ద్వారా బూడి ముత్యాలనాయుడుకు చెప్పాం. రోడ్డు వేస్తానని చెప్పారు. మాట నిలబెట్టుకున్నారు. మేం ఎప్పటికీ జగనన్నకు రుణపడి ఉంటాం.

– భూలం పైడితల్లమ్మ(8వ వార్డు మెంబర్), కొండెంపూడి గ్రామం

మా బాధలు తీరనున్నాయి..



మా తాత తండ్రుల నుంచి మా నాలుగు గ్రామాల్లో సాయంత్రం అయితే బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోయేవి. వర్షాకాలం అయితే పగటి పూట కూడా ఒక్కరు వెళ్లేందుకు భయమేసేది. దారంతా గోతులు, గొతుకులు సైకిలు కూడా తొక్కడానికి ఇబ్బంది పడేవాళ్లం. నాలుగు కలిపి 300 మంది లేము.. అందువల్లే మా రోడ్డుకి బోలెడంత డబ్బు ఖర్చు అవుతుందని నాయకులు ముఖం చాటేసేవారు. ఈ సమస్య ఇప్పట్లో పరిష్కారం కాదనుకున్నాం. మాజీ సీఎం జగనన్న రూపంలో మేం కొలిచే దేవతలే ఈ రోడ్డు నిర్మాణానికి ముందుకొచ్చారనుకుంటున్నాం. మా బాధలు తీరనున్నాయి.

– ఆగారి రాము (7వ వార్డు సభ్యుడు), గొవ్వూరు

మండల బడ్జెట్‌కు ఆమోదం


ఎంపీపీ సుర్ల రాజేశ్వరి అధ్యక్షతన బడ్జెట్ సమావేశం

నర్సీపట్నం : వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నర్సీపట్నం మండల పరిషత్ అధికారులు రూపొందించిన బడ్జెట్‌కు ఎంపీటీసీలు ఆమోదం తెలిపారు. 2025–26 బడ్జెట్‌పై గురువారం ఎంపీపీ సుర్ల రాజేశ్వరి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బడ్జెట్‌లో రూపొందించిన అంశాలను కార్యాలయ సూపరింటెండెంట్ రమణబాబు చదివి వినిపించారు. ఆదాయం రూ.1,96,62,505గా, ఖర్చు 91,08,207గా చూపారు. సీనరేజీ, ఆస్తి మార్పిడిపై సర్ ఛార్జి, మార్కెట్లు, షాపుల అద్దె ద్వారా ఆదాయం సమకూరుతుందని అధికారులు బడ్జెట్‌లో పేర్కొన్నారు. వచ్చిన ఆదాయంలో శాతం షెడ్యూల్ కులముల అభివృద్ధికి 15శాతం, షెడ్యూల్ జాతులకు 6 శాతం, మహిళ శిశు సంక్షేమానికి 15 శాతం, తాగు నీరు 12 శాతం ఇంజినీరింగ్ పనులు 23 శాతం, మండల ప్రజా పరిషత్ కార్యాలయం నిర్వహణకు 15 శాతం నిధులు ఖర్చు చేయాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి, మా దృష్టికి తీసుకువచ్చినట్లయితే ప్రాధాన్యత క్రమంలో చేయటం జరుగుతుందని రమణబాబు తెలిపారు. ఈ సమావేశంలో వైస్‌ఎంపీపీలు తాతబాబు, ఇన్నం రత్నం, ఎంపీటీసీలు బోళెం రాంప్రసాద్, మాకిరెడ్డి తాతమ్మ పాల్గొన్నారు.

కోలాటం మహిళలకు దుస్తుల వితరణ


కోలాటం మహిళలకు చీరలతో పాటు సామగ్రి అందిస్తున్న వైస్ ఎంపీపీ సూర్యనారాయణ

కె.కోటపాడు : ఆధ్యాత్మిక కార్యక్రమాల సమయాల్లో గ్రామీణ ప్రాంతాల్లో గల మహిళలు భక్తి గీతాలకు కోలాట ప్రదర్శనతో అందరి మన్ననలను పొందడం అభినందనీయమని వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ అన్నారు. పాచిలవానిపాలెం గ్రామంలో గల 25 మంది కోలాటం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మహిళలకు పరశురాం గురువు ఏకరూపు చీరలతో పాటు కోలాటం సామాగ్రిని రూ.17వేల సొంత నగదుతో సమకూర్చారు. వీటిని మహిళలకు వైస్ ఎంపీపీ సూర్యనారాయణ చేతుల మీదుగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షుడు సిరపరపు రమణారావు, రొంగలి శ్రీరామ్మూర్తి, గండి సత్యనారాయణ పాల్గొన్నారు.

జగనన్న జన్మదిన వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు


రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, పార్టీ శ్రేణులు

నాతవరం : వైఎస్సార్‌సీపీ అధినేత మాజీ సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఈనెల 21న వేడుకలు ఘనంగా నిర్వహించాలని మండల పార్టీ అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం రక్తదానం శిబిరం పోస్టర్‌ను పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. 21న రక్తదానం శిబిరం మాజీ ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ ఆధ్వర్యంలో పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేశారన్నారు. పార్టీ నాయకులు అభిమానులు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీ పైల సునీల్, నాతవరం సర్పంచ్ గొలగాని రాణి, ఉప సర్పంచ్ అప్పలరాజు, మహిళా విభాగం మండలశాఖ అధ్యక్షురాలు పుష్ప, గన్నవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వరహాలబాబు, మండల పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు వెంకటరమణ, పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు సూరిబాబు పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో...

మాడుగుల : ఈ నెల 21వ తేదీన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు పురస్కరించుకుని ఘాట్‌రోడ్ జంక్షన్‌లో వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో భారీ స్థాయిలో జన్మదిన వేడుకలు జరగనున్నాయని, ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు హాజరు కానున్నారన్నారు. ఉదయం 9 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి అనకాపల్లి జిల్లా మహిళా అధ్యక్షురాలు, ఈర్లె అనురాధ, మాజీ ఎంపీపీ రామధర్మజ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ కిముదు రమణమ్మతో పాటు వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యుల చేతుల మీదుగా కేక్ కటింగ్ ఉంటుందన్నారు.

గొండుపాలెంలో ఉచిత కంటి వైద్య శిబిరం

కె.కోటపాడు : సంఘమిత్ర ఆధ్వర్యంలో గురువారం గొండుపాలెం గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గ్రామానికి చెందిన 267 మందికి కంటి పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. వీరిలో 26 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరంగా గుర్తించారు. వీరికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలను జరిపేందుకు ఎల్.వి.ప్రసాద్ ఆస్పత్రికి తరలించారు. సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రధాన కార్యదర్శి మంగపతి పాల్గొన్నారు.

ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు


క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ముఖ్య అతిథి బిషప్ జీవన్‌రాయి

నర్సీపట్నం : పట్టణంలో జెరూసలేం ప్రేయర్ హౌస్‌లో నర్సీపట్నం పాస్టర్స్ కోర్ కమిటీ ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కొండలఅగ్రహారం ఇమ్మానియేల్ మినిస్ట్రీస్ బిషప్ జీవన్‌రాయి ముఖ్య అతిథిగా పాల్గొని ఏసు సందేశం వినిపించారు. అనంతరం బిషప్ డానియల్, బెంజిమన్, కృపా సెల్విన్ ప్రసంగించారు. ముందుగా కేక్ కట్ చేసి క్రిస్మస్ విషెస్ చెప్పుకున్నారు. కేక్ కట్ చేసి కొవ్వొత్తులు వెలిగించి క్రిస్మస్ గీతాలు ఆలపించారు. ఈ వేడుకల్లో నియోజకవర్గంలోని కోర్ కమిటీలో పాస్టర్స్ పాల్గొన్నారు.

వరి చేలను ముంచెత్తిన వర్షాలు


పొలాల్లోనే వరి కుప్పలు వేస్తున్న రైతులు


పొలంలో పనల కింద చేరిన వర్షపు నీరు

నాతవరం : ఎంతో కష్టపడి పెట్టుబడి పెట్టి పండించిన పంట చేతికంది వచ్చే సమయంలో తుపాను కారణంగా రైతులకు తీవ్ర నష్టం కలిగింది. జిల్లాలోనే అధిక విస్తీర్ణంలో ఖరీఫ్ సాగు వరి పంట రైతులు వేసుకున్నారు. తాండవ ప్రాజెక్టు నుంచి ఖరీఫ్ సాగుకు నీరు ఆలస్యంగా ఆగస్టు 19వ విడుదల చేశారు. ఆ నీటితో వేసుకున్న వరి చేను ప్రస్తుతం మండల వ్యాప్తంగా పండేసి కోత దశకు రావడంతో వారం రోజులుగా ముమ్మరంగా కోతలు కోస్తున్నారు. నాతవరం, గునుపూడి, ఎ.శరభవరం, యం.బి.పట్నం, మన్యపురట్ల, ఎంబీపట్నం, రాజుపేట అగ్రహారం, లింగంపేట, వల్సంపేట, గన్నవరం గ్రామాల్లో అధికారులు తుపాను హెచ్చరికలు చేయకముందే వరి చేను కోసేసుకున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అధిక శాతం వరి చేను తడిసి పోవడంతో రైతులు దిగాలు చెందితున్నారు. వాతావరణ కేంద్రం హెచ్చరికలతో అధికారుల లాదేశాలతో కొంత మంది రైతులు తమ పొలాల్లోనే వరి కుప్పలు వేసుకుంటున్నారు, మిగతా రైతులు ఏమి చేయాలో అర్థం కాక అయోమయంలో ఉన్నారు.


మాడుగుల: అల్పపీడన ప్రభావంతో రైతులు పొలాల్లో కోసిన వరిచేలు ఆరక ముందే వరి పనలు కుప్పలుగా చేస్తున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాలులో వరి పనలు తడిచి పోవడంతో గత్యంతరం లేక తడిచిన చేలు యంత్రాలతో నూర్పిడి చేస్తున్నారు. ఈ ఏడాది పంట పండిన తర్వాత వాతావరణం అనుకూలించక చేతికందిన పంట నష్టపోతున్నామని రైతులు దిగులు చెందుతున్నారు.

కె.జె.పురంలో ముత్యమాంబ మాలాధారణ


కె.జె.పురంలో మాలాధారణలో భక్తులు

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామంలో ముత్యమాంబ మాలాధారణ గురువారం ప్రారంభమైంది. 9 రోజుల పాటు మాలాధారణలో అమ్మవారి ఆలయంలో ఉదయం, సాయంత్రం పూజలు నిర్వహించనున్నారు. ఐదేళ్ల నుంచి అమ్మవారి మాలాధారణ జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆడారి బాబ్జి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ముత్యమాంబ ఆలయం వద్ద ఉదయం, సాయంత్రం పూజలు, రాత్రికి భజన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. భక్తులు, ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.

రైవాడలో రూ.8 లక్షలతో సీసీ రోడ్డు పనులు


రైవాడ గ్రామానికి సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ చల్లా లక్ష్మి, గ్రామ పెద్దలు

దేవరాపల్లి : రైవాడ గ్రామంలోకి వెళ్లే రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. వై జంక్షన్ నుంచి గ్రామం వరకు ఈ రోడ్డు పూర్తిగా గోతులమయంగా మారడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ చల్లా లక్ష్మి గురువారం ప్రారంభించారు. పంచాయతీ నుంచి రూ.4 లక్షలు, మండల పరిషత్ గ్రాంట్ నుంచి రూ.4 లక్షలు కలిపి మొత్తంగా రూ.8 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి సంకల్పించారు. ముందుగా ప్రస్తుతం ఉన్న రహదారిని పొక్లెయిన్‌తో చదును చేసి అనంతరం సీసీ రోడ్డు నిర్మాణం చేయనున్నట్టు సర్పంచ్ లక్ష్మి తెలిపారు. ఈ నిధులు మంజూరుకు కృషి చేసిన ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యంకు సర్పంచ్ చల్లా లక్ష్మికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. కార్యక్రమంలో చల్లా నాయుడు, అప్పలనాయుడు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

- ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి
- ఎంపీపీ సుర్ల రాజేశ్వరి


పార్టీ నాయకులతో కలిసి రక్తదాన శిబిరం వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సుర్ల రాజేశ్వరి

నర్సీపట్నం : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 21న పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ సుర్ల రాజేశ్వరి పిలుపునిచ్చారు. పార్టీ నాయకులతో కలిసి గురువారం రక్తదాన శిబిరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో జరుగుతున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలన్నారు. మండలంలోని 12 పంచాయతీల నుండి పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు విధిగా హాజరై రక్తదానం చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు కన్నయ్యనాయుడు, వైస్ ఎంపీపీ తాతబ్బాయి, శానపతి వెంకటరత్నం, యల్లన్న, చిన అప్పలనాయుడు, సుర్ల శేఖర్, మురళి, శెట్టి అచ్చిరాజు పాల్గొన్నారు.

ఆరుగాలం కష్టం... కన్నీటిపాలు!


లోపూడిలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



లోపూడి సింగవరంలో తడిసిన పోయిన వరి పనలను ఓద్దుకు చేర్చి ఆరబెడుతున్న రైతులు


లుల్లూరులో తడిసిన వరి పంటను పరిశీలిస్తున్న రైతు సేవా సిబ్బంది

బుచ్చెయ్యపేట : అల్పపీడన ప్రభావం వల్ల మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆరుగాలం పాటు పండించిన వరి పంట తడిసి ముద్దయింది. గత నెల 25 వ తేది నుంచి ఫెంగాల్ తుఫాన్ ప్రభావంతో రైతులు పూర్తిగా పండిన వరి పంట కొయ్యకుండా వరి కోతలు వాయిదా వేసుకోస్తున్నారు. ఈ సమయంలో నాలుగు రోజుల క్రితం వాతావరణం అనుకూలించడంతో రైతులు వరి కోతలు కోసారు. ఈ నెల 17 వ తేదీ సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షాల వల్ల కోసిన పంట తడిసి ముద్దయింది. వడ్డాది, చిన అప్పన్నపాలెం, లోపూడి, సింగవరం, లల్లూరు, దిబ్బిడి, బుచ్చెయ్యపేట, వీఆర్‌ఆర్‌పేట, గ్రామాల్లో కోసిన వరి పంట తడిసిపోయాయి. తడిసిన వరి పంటను పంట పొలాల్లో నూర్పు మిషన్ల ద్వారా నూర్పు చేస్తున్నారు. మరో వైపు పంట పొలాల్ల వరి కుప్పలు పెట్టారు. ఒకేసారి వరి పంటను ఎత్తేటప్పుడుకు వ్యవసాయ కూలీలకు డిమాండ్ పెరిగింది. మహిళలకు రూ.700, పురుషులకు రూ.900 వరకు డిమాండ్ పెరిగింది. దీనికి తోడు నూర్పు మిషన్లకు డిమాండ్ పెరిగింది. గంటకు రూ.2000 వరకు ఉంది. తీవ్ర వ్యయ ప్రయాసలకు ఓర్చి రైతు పండించిన పంట చేతి కొచ్చే సమయంలో నీటి పాలైంది.

నాతవరం : తుపాను కారణంగా వరి రైతులకు తీవ్ర నష్టం కలిగింది. తాండవ ప్రాజెక్టు నుంచి ఖరీఫ్ సాగుకు నీరు ఆలస్యంగా ఆగస్టు 19వ విడుదల చేశారు. ఆ నీటితో వేసుకున్న వరి చేను ప్రస్తుతం మండల వ్యాప్తంగా పండేసి కోత దశకు రావడంతో వారం రోజులుగా ముమ్మరంగా కోతలు కోస్తున్నారు. నాతవరం, గునుపూడి, ఎ.శరభవరం, యం.బి.పట్నం, మన్యపురట్ల, ఎంబీపట్నం, రాజుపేట అగ్రహారం, లింగంపేట, వల్సంపేట, గన్నవరం గ్రామాల్లో అధికారులు తుపాను హెచ్చరికలు చేయకముందే వరి చేను కోత కోశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అధిక శాతం వరి చేను తడిసి పోయింది. దీంతో మండలంలో ఖరీఫ్ పంట సాగు చేసిన రైతులకు కన్నీరే మిగిలిందంటూ ఆవేదన చెందుతున్నారు.

సుస్థిరాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం

దేవరాపల్లి : గ్రామ పంచాయతీల్లో లో సుస్థిరాభివృద్ధికి ప్రాధాన్యం కల్పించి, అందుకు తగ్గట్టుగా నిధులు కేటాయించాలని ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం అన్నారు. సుస్థిరాభివృద్ధిపై గత నాలుగు రోజులుగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా సామర్లకోటలోని ట్రైనింగ్ సెంటర్ నుంచి వచ్చిన అబ్జర్వర్ పి. శ్రీనివాసరావు సుస్థిరాభివృద్ధికి తోడ్పడే లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలని సూచించారు. సహజ వనరులను సద్వినియోగం చేసుకునేలా ప్రజలను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలన అధికారి డి.వి. లక్ష్మీనారాయణ, వెలుగు ఏపీఎం ఎస్. ప్రభాకర్, పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పి. ప్రసాదరావు, రైవాడ పంచాయతీ కార్యదర్శి జామి అప్పారావు పాల్గొన్నారు.

21న సీపీఎం సభను విజయవంతం చేయండి

కె.కోటపాడు : నర్సీపట్నంలో ఈ నెల 20 నుండి 22 వరకూ జరిగే సీపీఎం జిల్లా మహసభలను పార్టీ మద్దతుదారులుతో పాటు కార్మికులు, కర్షకులు విజయవంతం చేయాలని కుల వివక్ష పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి గాడి ప్రసాద్ అన్నారు. కె.సంతపాలెం గ్రామంలో గురువారం జిల్లా మహసభలకు సంబంధించిన గోడపత్రికలను ఆయన విడుదల చేశారు.